ప్రజా సేవలో..

సచివాలయం	నంబర్
యల్లపువానిపాలెం-1	1086461
యల్లపువానిపాలెం-2	1086462
యల్లపువానిపాలెం-3	1086465
యల్లపువానిపాలెం-4	1086467
చంద్రానగర్-1	1086463
అప్పలనర్సయ్య కాలనీ	1086464
ఎస్సీబీసీ కాలనీ	1086466

వార్డులోని సచివాలయాలు...

89వ వార్డు	
సచివాలయాలు	7
ఉద్యోగులు	54 మంది
వలంటీర్లు	160 మంది

నాడు అలా..

సంక్షేమ పథకాలు, సేవలు, ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. పింఛన్, ఫీజు రీయింబర్స్‌మెంట్, రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ ఇలా ప్రభుత్వం నుంచి ఏ లబ్ధి పొందాలన్నా ఎన్నో నెలల పాటు ఎదురు చూడాల్సిన పరిస్థితి. ప్రజలు ఎదుర్కొన్న ఈ కష్టాలకు, టీడీపీ అవినీతి, అసమర్థ పాలనకు చరమగీతం పాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలకు శ్రీకారం చుట్టారు.

నేడు ఇలా..

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారు. పరిపాలనను ప్రజల చెంతకు చేరువ చేశారు. ఫలితంగా ప్రజల కష్టాలు తీరాయి.

- సచివాలయ వ్యవస్థతో చెంతనే పాలన
- ఇంటికే సంక్షేమ పథకాలు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు

గోపాలపట్నం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని సేవలు ముంగిట్లోనే అందుతున్నాయి. దీంతో అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, విద్యార్థులు, వ్యాపారులు ఇలా లబ్ధిదారులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సేవలను చేరువ చేయడం, వేగవంతంగా సేవలు అందుకోవడం గతంలో ఎన్నడూ చూడలేదని సీఎం వైఎస్ జగన్ పాలనను కొనియాడుతున్నారు. సచివాలయాల్లో లభించే ప్రతి సేవ ఉచితంగా, పారదర్శకంగా, పార్టీలు, వర్గాలకు అతీతంగా అందుతున్నాయి.

సచివాలయ స్వరూపం ఇదీ

వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, ఎమిటీస్ సెక్రటరీ, వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ కార్యదర్శి, ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీ, రెవెన్యూ సెక్రటరీ, శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ, వార్డు ఉమెన్, పోలీస్, హెల్త్ సెక్రటరీలు నియమించారు. ఉదయం 10 గంటల నుంచి సచివాలయంలో కార్యదర్శులు అందుబాటులో ఉంటారు.

ప్రతీ వార్డులో సగటున ఆరు నుంచి ఏడు సచివాలయాలు

ప్రతీ వార్డులో సగటున ఆరు నుంచి ఏడు సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సచివాలయానికి సగటున 11 మంది ఉద్యోగులను నియమించారు.


యల్లపువానిపాలెం సచివాలయం -2

చేరువైన సేవలు

- కుల, ఆదాయ, జనన, మరణ, ధ్రువపత్రాల నుంచి రైస్ కార్డులు, రిజిస్ట్రేషన్ల వరకు అన్ని పనులను సచివాలయాల్లో తక్కువ సమయంలో పూర్తి చేస్తున్నారు.
- ఏ పథకానికీ ఏ వ్యక్తీ, రాజకీయ నేత, అధికారి ఇల్లు, ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు.
- దళారీ వ్యవస్థ కనుమరుగైంది.
- అవినీతికి చోటు లేకుండా పోయింది.


సచివాలయంలో విధుల్లో ఉన్న సిబ్బంది

ప్రతి 50 నుంచి 100 ఇళ్లకు ఓ వలంటీర్

గతంలో ప్రభుత్వం ఏ పథకం అమలు చేస్తుందో, వాటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో, ఎవరిని సంప్రదించాలో ప్రజలకు తెలియని పరిస్థితి ఉండేది. ఇప్పుడు వలంటీర్లే ఇళ్లకు వెళ్లి పథకాలను వివరించి, వారే దరఖాస్తు చేస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులతో పాటు ఇతర పింఛన్లను ప్రతినెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యవస్థతో ప్రజల ఆత్మగౌరవం పెరిగింది. పింఛన్ల కోసం ఎండలో పడిగాపులు పడాల్సిన అవసరం లేకుండా పోయింది. ఎవరైనా లబ్ధిదారులు అనారోగ్యంతో దూరంగా ఉన్నా, ఆస్పత్రుల్లో చేరితే వలంటీర్లు అక్కడికి వెళ్లి కూడా పింఛన్లు అందజేసిన సందర్భాలు అనేకం.

సేవలు బాగున్నాయి



సచివాలయాలు వచ్చిన తర్వాత మాలాంటి వారికి ప్రభుత్వ సేవలు సులువుగా అందుతున్నాయి. ఇంతక ముందు అయితే ఏ అవసరం వచ్చినా ఏదో నాయకుడి దగ్గరికో.. కార్యాలయాల గురించి తెలిసిన వారి దగ్గరకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అందుబాటులో సచివాలయం ఉంది. మా పిల్లలకు అమ్మ ఒడికి అవసరమైన ధ్రువపత్రాలు వలంటీర్ ద్వారానే వచ్చాయి.లేకపోతే ఇబ్బందులు పడేవారం. -రామ లక్ష్మి, కొత్తపాలెం

చేయూత అందింది



ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయంటే సచివాలయాలే కారణం. ఈ వ్యవస్థ వచ్చిన తర్వాత ఏ పథకానికైనా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మా దగ్గరకే వస్తున్నారు. మా వివరాలు తీసుకుని అర్హత ఉంటే పథకానికి ఎంపిక చేస్తున్నారు. నాకు జగనన్న చేయూత అందింది. దీని ద్వారా కష్టాలు తీరాయి. మా కుటుంబం సమస్యలు నుంచి బయటపడింది. - సాయిదాబీబీ, నాగేంద్ర కాలనీ

ఒకటో తేదీనే పింఛన్



జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఒకటో తేదీ ఉదయం 6 గంటలకే పింఛన్ అందుకుంటున్నాను. గతంలో అయితే రోజంతా పింఛను కోసం ఎండనక వాననక కాసుకుని కూర్చునే వారం. ఆ ఇబ్బందులు తప్పాయి. - కొండ్రు చిన్నప్పయ్య, కొత్తపాలెం

పాలన చేరువ



సచివాలయాల ద్వారా పరిపాల సులువైంది. ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయి. ఇంటి వద్దకే సచివాలయ కార్యదర్శులు వచ్చారు. ప్రభుత్వ పథకాల కోసం మండల కార్యాలయాలు, వార్డు కార్యాల చుట్టూ తిరగాల్సిన బాధలు తప్పాయి. అర్హతను బట్టి పథకాలకు ఎంపిక చేస్తున్నారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమఅవుతుంది. - అయితంశెట్టి గోపాలకృష్ణ 89వ వార్డు నాయకుడు

క్లుప్తంగా

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న నమ్మి శ్రీను

విశాఖ విద్య: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని 90వ వార్డు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నమ్మి శ్రీను పిలుపునిచ్చారు. గ వార్డు పరిధిలోని కార్యకర్తలతో ప్రజల్లోకి సంక్షేమ పథకాలు సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ నాయకత్వంలో రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద వర్గాల అభ్యున్నతి కోసమం సీఎం వైఎస్‌జగన్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రతీ ఇంట్లో సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇదే విషయాన్ని అందరికీ తెలియజేయాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: గంభీరం, హనుమంతువాక కూడళ్లలో ఆటో డ్రైవర్లకు బుధవారం రహదారి నిబంధనలపై రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రత్యేక బృందాలు చేసిన తనిఖీల్లో నిబంధనలు పాటించని 8 ఆటోలపై కేసులు నమోదు చేశారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు హరి ప్రసాద్‌రావు, ఎస్. శ్రీనివాసయాదవ్, ఎస్ఐ రాజు తదితరులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ


లక్ష్మికి బంగారం ఉన్న బ్యాగ్ అందిస్తున్న క్రైం పోలీసులు

గోపాలపట్నం: గాజువాక నుంచి ఆటోలో సింహాచలం రైల్వే స్టేషన్‌కు కాశి లక్ష్మి అనే మహిళ వచ్చింది. రైల్వే స్టేషన్ వద్ద దిగే సమయంలో బంగారం ఉన్న బ్యాగ్‌ను వదిలి వెళ్లిపోయింది. కొద్ది సేపటికి గుర్తించిన ఆటో డ్రైవర్ సుధీర్ ఆ బ్యాగ్‌ను గోపాలపట్నం క్రైం పోలీసులకు అందించారు. అప్పటికే ఆమె స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఆమెకు క్రైం ఎస్ఐ వెంకట సురేష్ బంగారం ఉన్న బ్యాగ్‌ను అందించారు. అందులో నాలుగు తులాల గొలుసు ఉంది. ఈ సందర్భంగా పోలీసులు ఆటో డ్రైవర్‌ను అభినందించంతో పాటు వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ బి. జగనాథరాజు ఆదేశాల మేరకు బహుమతి అందించారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1014వ రోజు, బుధవారం సంస్థకు చెందిన ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యూటీడీ, ఆర్ అండ్ డీ, డీఎన్‌డబ్ల్యూ, ఈటీఎల్, టెలికామ్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు తమ ఉద్యమాలు ఆగవన్నారు. కార్మికులను చిన్నచూపు చూసిన ఎన్నో రాజకీయ పార్టీలు ఇప్పటికీ దీనస్థితిలో ఉన్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అదే గతి పడుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన


మాట్లాడుతున్న అయితంశెట్టి గోపాలకృష్ణ


వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు, ఆర్పీలు

గోపాలపట్నం: ప్రజా సాధికారత, సంక్షేమ, పారదర్శక పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్ రెడ్డితోనే సాధ్యమని, అందుకే ఆయనను మళ్లీ గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ 89వ వార్డు నాయకుడు అయితంశెట్టి గోపాలకృష్ణ అన్నారు. 89వ వార్డు నాగేంద్ర కాలనీలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను, సచివాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన పథకాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గోపాలకృష్ణ మాట్లాడుతూ తన పాలనలో ప్రజలకు మంచి జరిగితే ఓటు వేయండని అడగగలిగే నాయకుడు జగనన్న అని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించారన్నారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ పథకాల నగదు మీ ఖాతాల్లోకి వస్తున్నాయన్నారు. అందుకే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకోవాలని, ఆ భాధ్యత మనందరిపైనే ఉందని పిలుపునిచ్చారు. ఈ సచివాలయం పరిధిలో ప్రభుత్వ పథకాల ద్వారా రూ.4.69 కోట్లు వెచ్చించారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, మళ్ల శ్రీనివాసరావు, గవర నాయుడు, ఏపీడీ శ్రీరామ్, సీవో కనకమహాలక్ష్మి, షేక్ రెహమాన్, గృహసారథులు, ఆర్పీలు, స్థానికులు పాల్గొన్నారు.

షిప్‌యార్డు గుర్తింపు యూనియన్ నాయకులకు అభినందన


గుర్తింపు యూనియన్ ప్రతినిధులను అభినందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, బద్రీనాథ్

మల్కాపురం: హిందూస్తాన్ షిప్‌యార్డ్‌లో ఇటీవల జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించిన ఇంటక్ (ఐఎన్‌టీయూసీ) యూనియన్ నాయకులు బుధవారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. కార్మికులకు మేలు జరిగేలా పని చేయాలని సూచించారు. ఈ విషయంలో తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. వైఎస్సార్ టీయూ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీరామ్‌మూర్తి, అధ్యక్షుడు బోస్, సభ్యులు ధనంజయ్,గణేష్,డి.వి.రమణ,సురేష్,మాణిక్యాలరావు,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వుడా కాలనీలో చోరీ

- కిటికీ గ్రిల్ విరిచి ఇంట్లోకి ప్రవేశం
- కిలో వెండి ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరణ


ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న పోలీసులు


ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని వుడా కాలనీలోని ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. కిలో వెండి వస్తులతో పాటు రూ.50 వేల నగదు అపహరించుకుపోయారు. బుధవారం వెలుగుచూసిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి..వుడాకాలనీలో నివాసం ఉంటున్న ధర్మారావు దీపావళికి భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉన్న పిల్లల వద్దకు వెళ్లారు. బుధవారం ఉదయం వారు ఇంటికి తిరిగి వచ్చారు. అయితే లోపలకి వెళ్లి చూసేసరికి కిటికి కోసేసి ఉంది. ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడంతో ఆందోళనకు గురైన ధర్మారావు బీరువా తెరిచి చూడగా అందులోని కిలో వెండి వస్తువులు, రూ.50 నగదు మాయం అయినట్లు గుర్తించాడు. ఇంట్లోని గ్యాస్ సిలిండర్, బియ్యం బస్తా, ఇతర చిన్నపాటి సామగ్రిని కూడా దుండగులు పట్టికెళ్లిపోయారు. ఆనవాళ్లు దొరకకుండా ఇంట్లో కారం చల్లడం గమనార్హం. బాధితుని ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. వెస్ట్‌జోన్ క్రైం సీఐ బీవీజీ రాజు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి విద్యార్థినికి గాయాలు

మల్కాపురం: పాఠశాల భవనం పైనుంచి పడి ఓ విద్యార్థిని తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటనకు సంబంధించి పలు భిన్నకథనాలు వినిపిస్తున్నాయి. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 60వ వార్డు జవహర్ నగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న డి.జోషిత బుధవారం మధ్యాహ్నం పాఠశాల భవనంపైకి ఎక్కి అక్కడి నుంచి పడిపోయింది. ఆమె దిగువ ఉన్న జనరేటర్ రూమ్ రేకుల షెడ్‌పై పడడంతో గాయాలతో బయటపడినట్టు తెలిసింది. ఈ విషయాన్ని పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించి, చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే బాలిక మేడ పైకి ఎందుకు వెళ్లిందో, అక్కడ నుంచి కిందకు ఎలా జారిపడిందో అంతు చిక్కడం లేదు. దీనిపై పోలీసులను సంప్రదించగా.. దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని సీఐ జి.డి.బాబు తెలిపారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధి జవహర్ నగర్ 11కేవీ ఫీడర్ లో వార్షిక మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధి పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ,గుల్లపాలెం ఎఫ్ఆర్‌యూ (జీవీఎంసీ ఆస్పత్రి)ఆస్పత్రి ఏరియా,ఎంఐజీ కాలనీ, ఎంఐజీ-2 కాలనీ,హనుమాన్ సంజీవ్‌కాలనీ, నెహ్రూ నగర్, అశోక్‌నగర్, కొత్త నక్కవానిపాలెం ఏరియాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మురళీనగర్: ఎన్ఎస్‌టీఎల్ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 24న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ(ఆపరేషన్స్) బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మర్రిపాలెం వుడా లేఅవుట్, శివశివాని స్కూల్, పోలీస్ క్వార్టర్స్, పీఎఫ్ క్వార్టర్స్, లీడర్ కార్యాలయ ప్రాంతం, భాస్కర్ గార్డెన్స్, శివనగర్, ఎఫ్‌సీఐ కాలనీ, మర్రిపాలెం మెయిన్ రోడ్, గవర వీధి, గొల్ల వీధి, రాణా ప్రతాప్ నగర్, శ్రీనివాసనగర్, హుస్సేన్ నగర్, రైల్వే క్వార్టర్స్, నరేంద్రనగర్, ఓల్డ్ కరాస, న్యూ కరాస, శాంతినగర్, అంబేడ్కర్ నగర్ కాలనీ, నేతాజీ కాలనీ, రామ్‌నగర్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, ఎస్ఏడీ-1 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

25న టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం


మింది జెడ్పీ హైస్కూల్ మైదానాన్ని పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఈ నెల 25వ తేదీన శ్రీనివాస కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మింది వినాయక వేంకటేశ్వర సాయినాథ ఆలయ కమిటీ చైర్మన్ గుడివాడ నాగమణి తెలిపారు. ఈ మేరకు కల్యాణోత్సవం నిర్వహించనున్న పాఠశాల మైదానాన్ని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం పరిశీలించారు. కార్యక్రమం ఏర్పాట్లపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం 4.45 గంటల నుంచి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 8.01 గంటల నుంచి ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 56వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు


చాకలిగెడ్డ ప్రాంతంలో శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: సమస్యలు లేని నియోజకవర్గంగా పశ్చిమను తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామూర్తిపంతులుపేట, చాకలిగెడ్డ, గవర కంచరపాలెం, గొల్లకంచరపాలెం ప్రాంతాల్లో బుధవారం పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.58.40 లక్షలతో సీసీ డ్రైనేజీ, గెడ్డలకు రిటర్నింగ్ వాల్స్, ఓపెన్ జిమ్, బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రెండు కళ్లని.. ఆ దిశగానే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని జోన్-5 ఇంజినీరింగ్ అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆడారి శ్రీను, ఈఈ ప్రసన్న రెడ్డి, డీఈ ఏడుకొండలు, ఏఈ ఉషారాణి, 52, 56, 57 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్రికుమార్ యాదవ్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ కె.వి.నరసింహారావు, యూత్ అధ్యక్షుడు మజ్జి నూకరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురునాథ్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎంఈఎస్ ఆల్ పెన్షనర్స్' నూతన కమిటీ ఎన్నిక


విజయ ప్రసాద్ డాక్టర్ జాకబ్ లక్ష్మణరావు

విశాఖ విద్య: మిలటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ ఆల్ కేడర్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. ఎన్ఏడీ కూడలిలోని మర్రిపాలెం వాకింగ్ పార్కులో బుధవారం అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కందుల సత్యనారాయణ, అధ్యక్షుడిగా చెటికం విజయప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కండిపిల్లి నూకరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం. కనకారావు, సి.టి.రెడ్డి, శివరావు, రఘునాథ్, ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వారా జాకబ్, కోశాధికారిగా ధవళ లక్ష్మణరావును ఎన్నుకున్నారు. ఆడిటర్ కమ్ అడ్వైజర్‌గా కాకి సత్యారావు, లీగల్ అడ్వైజర్‌గా పి. లక్ష్మణమూర్తిని ఎంపిక చేసుకున్నారు. జాయింట్ సెక్రటరీగా ఎ. మోహన్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పులి సత్యనారాయణతో పాటు పలువురు కార్యవర్గంలో చోటు కల్పించారు. పెన్షనర్ల సమస్యలపై నూతన కమిటీ కృషి కృషి చేయడంతో పాటు సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని నిర్ణయించారు.

ఐరన్ ఓర్ సరఫరాకు సహకరించాలని వినతి


ఎన్ఎండీసీ ఈడీ వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన ఐరన్ ఓర్ సరఫరాకు సహకరించాలని స్టీల్‌ప్లాంట్ ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు ఎన్ఎండీసీ ఈడీ వెంకటేశ్వర్లును కోరారు. ఎన్ఎండీసీ బచేలి నుంచి స్టీల్‌ప్లాంట్‌కు విచ్చేసిన వెంకటేశ్వర్లును కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌లు పూర్తిస్థాయిలో నడవడానికి రోజుకు 8 ర్యాకుల ఐరన్ ఓర్ అవసరమన్నారు. తద్వారా పూర్తి స్థాయి ఉత్పత్తి సాధ్యమవుతుందన్నారు. దీనిపై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతానికి ఆరు ర్యాకుల ఐరన్ ఓర్ కచ్చితంగా సరఫరా చేస్తామని, భవిష్యత్తులో ఏడు ర్యాకుల సరఫరాకు ప్రయత్నిస్తామని తెలిపారు. స్లర్రీ పైపు లైను ద్వారా ఐరన్ ఓర్ సరఫరాకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. అదే విధంగా రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు కూడా కిరండూల్ లైన్ చేపట్టారని, అది పూర్తయితే సరఫరా ఇంకా మెరుగవుతుందన్నారు. ఈ సందర్భంగా ఈడీని సత్కరించారు. కార్యక్రమంలో సీజీఎం యు.శ్రీధర్, జీఎం గౌతమ్, ఐఎన్‌టీయూసీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, వి.ఎం.నాయుడు, బీ.ఎస్.రాజు, సుబ్బయ్య, నాయక్, ఏఐటీయూసీ మిత్రపక్షాల నాయకులు జె.రామకృష్ణ, మసేనురావు, బి.డేవిడ్, కె.శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ గురునాథరావుకు నివాళి


గుడివాడ గురునాథరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు 22వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన స్వగ్రామం మిందిలో జిల్లా పరిషత్ హైస్కూల్ పక్కనున్న గురునాథరావు విగ్రహానికి ఆయన తనయుడు, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్న తనను ప్రజలు ఆదరించడం ఆనందంగా ఉందన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో గురునాథరావు సోదరుడు, వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు రెడ్డిపల్లి చిట్టిబాబు, ఈటి సురేష్, రొక్కం వెంకటరావు, సంద్రాన నూకరాజు, ఈటి శ్యామలరావు, వాకపల్లి శేఖర్, స్వర్గీయ గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.